ఈనాడు
వైయస్సార్

శుక్రవారం అక్టోబరు 18, 2024



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్

ఘనంగా వాల్మీకి జయంతి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రామాయణంలో సీతారాముల సద్గుణాలు, గొప్పదనాన్ని చెప్పడంతోపాటు కుటుంబ విలువలు, ఆదర్శవంతమైన జీవితం లాంటి ఎన్నో సూత్రాలను లోకానికి పరిచయం చేసిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ శ్లాఘించారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, సోషల్‌వెల్ఫేర్ డీడీ సరస్వతి, బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, బీసీ సంక్షేమశాఖాధికారి కృష్ణయ్య, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, బీసీ సంఘాల నేతలు అవ్వారు మల్లికార్జున, వెంకటరమణ, నారాయణ, రామచంద్రయ్య, లింగమూర్తి, వాగేశ్వర రావు, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

తెగిన వంతెన... రాకపోకలకు యాతన



కమలాపురం నుంచి చాపాడుకు వెళ్లే మార్గంలో గంగవరం వద్ద పెన్నా నదిపై ఉన్న వంతెన తెగిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు మైలవరం ప్రాజెక్టు నుంచి పెన్నా నదికి నీటిని విడుదల చేయడంతో నది ఉధృతంగా ప్రవహించడంతో లో లెవెల్ వంతెన బుధవారం తెగిపోయింది. దీంతో రెండు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వ్యాపారులు, రైతులు ఇబ్బందులు పడుతూ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. వర్షాలు కురిసినప్పుడల్లా వంతెన కొట్టుకుపోతుండంతో ఇబ్బందులు పడుతున్నామని, ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే , కమలాపురం


పెన్నమ్మ పరవళ్లు!



పెన్నానది పరివాహక ప్రాంతాల్లో గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పెన్నానది పరవళ్లు తొక్కుతోంది. వల్లూరు మండలం ఆదినిమ్మాయపల్లి ఆనకట్ట వద్ద అప్రోచ్ రోడ్డును దాటి ప్రవాహం కొనసాగుతోంది. సాధారణంగా ఆనకట్ట సగం వరకు కొనసాగే ప్రవాహం ప్రస్తుతం చివరి వరకు ఉరకలెత్తుతోంది. ఆనకట్ట వద్ద వరద ప్రవాహాన్ని తిలకించేందుకు కడప నగరంతోపాటు సమీప మండలాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలి వస్తుండడంతో సందడి నెలకొంటోంది.

-ఈనాడు, కడప

నిర్మాణాలు... అంతటా అక్రమాలు!



గత వైకాపా ప్రభుత్వ హయాంలో అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాల్లోని జగనన్న కాలనీల్లో చోటుచేసుకున్న అక్రమాలు క్రమంగా వెలుగు చూస్తున్నాయి. ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నేతల అండతో సిబ్బంది ఇష్టా రాజ్యంగా వ్యవహరించి నిరుపేదలను నిలువునా మోసగించారు. ఇళ్లు కాదు.. ఊళ్లు కడతామంటూ మాయమాటలు చెప్పి దోపిడీకి పాల్పడ్డారు. ఏ లేఅవుట్‌ను చూసినా అక్రమాలు బయటపడుతున్నాయి. పొరుగుసేవల పేరిట వైకాపా అనుచర వర్గాన్ని అందలమెక్కించి వారి ద్వారా దందా సాగించారు. వారంతా ఇప్పటికీ తిష్టవేసుకుని అక్రమాలు సాగిస్తుండడంతో రూ.కోట్లలో అవినీతి చోటుచేసుకుంది. వీటిపై ఎన్డీయే ప్రభుత్వం సమీక్షించి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

- ● జగనన్న కాలనీల్లో భారీ దోపిడీ!
- ● లబోదిబోమంటున్న లబ్ధిదారులు
- ● సమగ్ర విచారణతోనే పరిష్కారం

–ఈనాడు, కడప

రాయచోటి పట్టణ సమీపంలోని నారాయణరెడ్డిపల్లె లేఅవుట్‌లో తాజాగా పలు అక్రమాలు వెలుగుచూశాయి. లేఅవుట్‌లో 5,740 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టగా, భారీ ఎత్తున అక్రమాలు జరిగినట్లు గృహనిర్మాణ సంస్థ విజిలెన్స్ విచారణలో బయటపడింది. లబ్ధిదారులకు కేటాయించిన రూ. 15,86,480 విలువ చేసే 21 టన్నుల ఇనుము, రూ. 19,80,650 విలువ చేసే 11,318 టన్నుల ఇసుక, సిమెంటు కలిపి మొత్తంగా రూ. 35 లక్షల విలువైన సామగ్రిని కాజేసినట్లు తేల్చారు. అవినీతికి బాధ్యులైన సిబ్బందిపై వేటు వేయాలని కలెక్టర్‌ను కోరుతూ సంస్థ ఎండీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. వీరిపై చర్యలు తీసుకునే అవకాశం ఎండీ స్థాయిలోనే ఉండగా కలెక్టర్‌కు అప్పగించడం, కొన్నాళ్లపాటు తాత్సారం చేసి పునర్విచారణకు ఆదేశించడం, జిల్లాస్థాయిలో జరిగిన దర్యాప్తుపై అనుమానాలు తలెత్తేవిధంగా నివేదిక వెలువడింది. సంస్థ విజిలెన్స్ విచారణలో వెలుగు చూసిన అక్రమాలపై జిల్లాస్థాయిలో చేపట్టిన విచారణలో కేవలం ఇసుక వరకే పరిమితం చేశారు. దీని వెనుక వైకాపా కీలక నేతల హస్తం ఉన్నట్లు విమర్శలున్నాయి. పునర్విచారణలో ఇనుము, సిమెంటు దోపిడీని తప్పించారనే విమర్శలున్నాయి. పొరుగు సేవల సిబ్బందిని తొలగించగా, వారు స్వాహాచేసిన నిధులను రాబట్టకుండా వదిలేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ కార్యకర్తలను పొరుగు సేవల కింద నియమించి దోపిడీకి పాల్పడ్డారు. హోటళ్లలో పని చేస్తున్న వ్యక్తులు సైతం నారాయణరెడ్డిపల్లె లేఅవుట్‌లో పొరుగు సేవల కింద పని చేశారు. ఈ సిబ్బంది ఆస్తులు అనతికాలంలోనే అమాంతంగా పెరిగిపోవడం రాయచోటి పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



కమలాపురం గోదాములో గడ్డకట్టిన సిమెంటు బస్తాలు

● కమలాపురం నియోజకవర్గంలో లబ్ధిదారులను మోసగించారు. గృహ నిర్మాణ సంస్థ సామగ్రి సరఫరా పేరిట తలుపులు, కిటికీలు అందజేసినట్లు నమోదు చేసి బిల్లుల నుంచి మినహాయించుకున్నట్లు బయట పడింది. లబ్ధిదారులకు వాటిని సరఫరా చేయకనే వారి పేరిట నమోదు చేసినట్లు గుర్తించి వారంతా లబోదిబోమంటున్నారు. అక్రమాలపై బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వల్లూరు, కమలాపురం, సీకే దిన్నె మండలాల్లో పరిశీలించిన సంస్థ అధికారి అక్రమాలకు పాల్పడినట్లు బయటపడింది. సంస్థ ద్వారా సరఫరా చేసిన సామగ్రి విక్రయించుకుని లబ్ధిదారులను మోసగించినట్లు తేలింది. కమలాపురం గోదాములో 194 బస్తాల సిమెంటు గడ్డకట్టిపోయింది. గోదాములో 15 టన్నుల ఇనుము అందుబాటులో ఉన్నప్పటికీ లబ్ధిదారులకు కేటాయించకుండా తుప్పుపట్టిపోయేలా చేశారు. దీనిపై ఎండీ కార్యాలయం అక్షింతలు వేసింది.

● ముద్దనూరులోనూ అక్రమాలు వెలుగు చూశాయి. గ్రామంలో మూడు లేఅవుట్లలో గృహనిర్మాణాలు జరిగాయి. ఇక్కడ ఇనుము, సిమెంటు, ఇసుక స్వాహా చేసినట్లు సంస్థ పరంగా జరిగిన విచారణలో తేలింది. ఇలా మొత్తంగా రూ. 30 లక్షల అవినీతి చోటు చేసుకున్నట్లు అంచనా వేశారు. ఇళ్ల నిర్మాణం ప్రగతిని బట్టి బిల్లులు, సామగ్రి సరఫరా చేయాలి. పునాదుల వరకే ఇళ్ల నిర్మాణం జరిగినప్పటికీ పైకప్పు వేసినట్లుగా చూపిస్తూ సిమెంటు, ఇనుము స్వాహా చేసినట్లు బయటపడింది. దండలూర్ని బయటకు రావాలంటే లేఅవుట్లలో ఇళ్ల వారీగా విచారణ చేపట్టే పక్షంలో పూర్తిగా వెలుగు చూసే అవకాశం ఉంటుంది.



నారాయణరెడ్డిపల్లె లేఅవుట్‌లో నిర్మాణంలో ఇళ్లు



● పునాదుల వరకే ఇంటి నిర్మాణం చేపట్టాం. గోడలు కట్టలేదు. మాకు తలుపులు, కిటికీలు అందజేసినట్లు నమోదు చేశారు. ఇలా మోసానికి పాల్పడడం ఎంత వరకు భావ్యం.

- షేక్ ఫాతిమాబీ, ఓబాయపల్లె లేఅవుట్, వల్లూరు మండలం



● సిమెంటు తీసుకోకపోయినా మా ఖాతాలో 40 బస్తాలు పొందినట్లు నమోదు చేశారు. బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాం. తప్పుడు లెక్కలు రాసి మమ్మల్ని మోసం చేశారు.

- గంగులమ్మ, ఓబాయపల్లె, వల్లూరు మండలం



కడప కమిషనర్‌గా మనోజ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

కడప నగరపాలక, న్యూస్‌టుడే: కడప నగర పాలక సంస్థ కమిషనర్‌గా మనోజ్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి కడప జిల్లా రాయచోటిలో ఆయన విద్యాభ్యాసం సాగింది. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అనంతరం ముంబయి ఐఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఏపీపీఎస్సీ పరీక్షల్లో విజయం సాధించి 2023లో పలమనేరు సబ్‌కలెక్టర్‌గా విధుల్లో చేరారు. అక్కడ నుంచి కడప నగరపాలకసంస్థ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప నగరంలో తాగునీటి సరఫరా, భూగర్భమురుగునీటిపారుదల వ్యవస్థ, వరదనీటిపారుదల పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రజా ప్రతినిధుల సహకారంతో కడప నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు.

పీజీ స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం

వైవీయూ (కడప) : యోగి వేమన విశ్వ విద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్పాట్ అడ్మిషన్లు గురువారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ పర్యవేక్షించారు. ఈ నెల 21వ తేదీ వరకు అడ్మిషన్లు కొనసాగుతాయన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప విద్య, న్యూస్‌టుడే : మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు, ఉత్తర్వులు ఇదే విద్యావ్యవస్థలో భాగంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయులకు మాత్రం వర్తించడం లేదన్నారు. 3, 4, 5 తరగతులను విలీనం చేసినా, బోధించడానికి స్కూల్ అసిస్టెంట్‌లను ఇవ్వలేదని చెప్పారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. అనంతరం డీఈవో అనురాధకు వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు నరసింహారావు, రమణ, ఏజాస్‌అహ్మద్, ప్రభాకర్, రూతు ఆరోగ్యమేరి, కృష్ణారెడ్డి, మేరీప్రసన్న, దత్తు, కరీముల్లా, కేదార్నాథ్, హిఫాజతుల్లా, బాబు, మహమ్మద్ ఆసిఫ్, విశ్వనాథ్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను తొలగించడం దుర్మార్గం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో తొలగించిన కార్మికులను తక్షణమే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. కడప కలెక్టరేట్ ఎదుట గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా లాంటి కష్టకాలంలో ప్రజలకు మేలు చేసేలా తమ ప్రాణాలను పణంగా పెట్టి పనిచేసిన కార్మికులను నిర్దాక్షిణ్యంగా తొలగించడం దుర్మార్గమన్నారు. తక్షణమే తిరిగి విధుల్లోనికి తీసుకోవాలని, పని భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్‌కు వినతి పత్రం అందించారు. ఏఐటీయూసీ నాయకులు మద్దిలేటి, బాదుల్లా, నరసింహులు, తారకరామారావు, వెంకటాద్రి, జాన్, చంద్ర, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మున్సిపల్ వర్కర్లతో ఏఐటీయూసీ నాయకులు



మంగళసూత్రాలను చూపుతున్న అర్చకులు

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ నేత్రపర్వంగా నిర్వహించారు. తొలుత జానకీరాములను పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. అర్చకులు ఆధ్వర్యంలో రాములోరి పరిణయ ఘట్టం కమనీయంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ తనిఖీ అధికారి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

చివరికి మిగిలింది కన్నీరే! / ఆశల పంట వర్షార్పణం



ఒంటిమిట్ట మండలం బోటుకిందపల్లికి చెందిన కోనేటిశెట్టి శ్రీహరి ఖరీఫ్‌లో 3.50 ఎకరాల్లో వరి సాగు చేశారు. రూ. 95 వేలు పెట్టుబడి పెట్టారు. ఈసారి 40 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. మరో మూడు రోజుల్లో కోత కోయాల్సి ఉండగా వర్షంతో పైరు నేలవాలిపోయింది. నీటిలో నానడంతో మొసులొచ్చాయి. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నష్టం ఇలా....

మండలం	హెక్టార్లలో
వల్లూరు	361.19
చెన్నూరు	397.41
పోరుమామిళ్ల	125.86
కమలాపురం	88.93
కడప	80.93
పెండ్లిమర్రి	40.47
ఒంటిమిట్ట	39.66
సిద్దవటం	25.09
చాపాడు	14.57
బి.కోడూరు	12.14
సీకే దిన్నె	10.93
కలసపాడు	10.12

–న్యూస్‌టుడే, కడప, కడప వ్యవసాయం, జిల్లా సచివాలయం

జిల్లాపై వాయుగుండం విరుచుకుపడింది. అల్పపీడనం రూపంలో విపత్తు ముంచేసింది. కర్షకుల కలలు కన్నీటి పాలయ్యాయి. అన్నదాతల ఆరుగాలం శ్రమ నేలపాలైంది. వేలాది రూపాయల పెట్టుబడి చేజారిపోయింది. ఆశల పంట వర్షార్పణమైంది. కళ్లెదుటే పచ్చని పంట దెబ్బతినడంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంట సాధారణ విస్తీర్ణం 31,171 హెక్టార్లు. తొలుత ప్రతికూల వాతావరణంతో నాట్లు వేయడానికి చాలామంది ముందుకు రాలేదు. ఆ తర్వాత కుందూ, పెన్నానదిలోకి నీరొచ్చింది. కేసీ కాలువకు నీటిని విడుదల చేశారు. బోర్ల కింద సాగునీటికి భరోసా దక్కడంతో కాస్త ఆలస్యంగానైనా 29 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. కొన్నిచోట్ల మరో వారం రోజుల్లో నూర్పిడి చేయాల్సి ఉంది. ఈ తరుణంలో తుపానుతో కురిసిన భారీ వర్షాలకు వెన్నులతో ఉన్న వరి నేలకు ఒరిగిపోయింది. మూడు రోజులకు పైగా ధాన్యం నీటిలో తడిసి నానడంతో గింజలు మొలకెత్తాయి. జరిగిన పంట నష్టం చూసి కర్షకులు కన్నీరుమున్నీరయ్యారు. ఎకరా విస్తీర్ణంలో సాగుకు రూ. 25 వేలు నుంచి రూ. 30 వేలు ఖర్చు చేయాలి. కౌలుకు తీసుకుంటే అదనంగా మరో రూ. 10 వేలు నుంచి రూ. 13 వేలు వరకు అవుతోంది. అన్నీ అనుకూలిస్తే ఎకరాకు సగటున 35-40 బస్తాల దిగుబడి వస్తోంది. తిండి గింజలకు కొరత ఉండదు. పశువులకు ఎండి గడ్డి లభిస్తోంది. ఈ సారి మంచి లాభాలొస్తాయని రైతులు ఆశించారు. ప్రకృతి ప్రకోపంతో కర్షకులు చేతికి రావాల్సిన వరి పంట 12 మండలాల్లో దెబ్బతింది. వాన ప్రభావం తీవ్రంగా ఉన్న 52 గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి 1,260.99 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. వర్షం తగ్గుముఖం పట్టగానే పంట పరిశీలించి నష్టం వివరాలను నమోదు చేసి, పెట్టుబడి రాయితీ మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపనున్నారు.

ఇతర పంటల పరిస్థితిదీ: జిల్లాలో వేరుసెనగ 21.04, మినుము 122.89, మొక్కజొన్న 16.19, కంది 0.40, ఉల్లి 635.20 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పెట్టుబడి రాయితీ కింద రూ. 1,58,80,000 అవసరమవుతాయని నివేదికలో పొందుపరిచారు.



ఎర్రగుంట్ల మండలం తిప్పలూరులో దెబ్బతిన్న ఉల్లి పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ బాధ్య డీడీ సుభాషిణి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా వ్యాప్తంగా అధికారులు అప్రమత్తంగా ఉండి బాధితులకు ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ ఆదేశించారు. గురువారం ఉదయం కడప కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయిలో అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని అన్ని రిజర్వాయర్లలో నీటి మట్టాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, చెరువులు, వంకలు, కాలువగట్లు తెగిపోకుండా చూడాలని, దెబ్బతిన్న రహదారులు, వంతెనలను పరిశీలించాలన్నారు.

మండలాల వారీగా వర్షపాతం (మి.మీలలో)


మండలం	వర్షపాతం
ఒంటిమిట్ట	85.6
సిద్దవటం	70.2
చెన్నూరు	67.8
సీకేదిన్నె	63.6
కడప	63.2
ఖాజీపేట	62.8
అట్లూరు	60.0
ఎర్రగుంట్ల	55.4
వల్లూరు	49.8
పెండ్లిమర్రి	48.2
కమలాపురం	47.6
వేంపల్లె	42.6
ముద్దనూరు	41.6
కాశినాయన	40.4
పులివెందుల	40.2
వేముల	40.0
కొండాపురం	39.6
జమ్మలమడుగు	36.2
పోరుమామిళ్ల	35.2
బి.కోడూరు	34.6
మైదుకూరు	33.6
సింహాద్రిపురం	32.8
కలసపాడు	32.6
తొండూరు	32.2
మైలవరం	30.6
బి.మఠం	29.2
చాపాడు	28.6
గోపవరం	26.8
దువ్వూరు	26.8
బద్వేలు	25.2
ప్రొద్దుటూరు	25.2
లింగాల	24.8
చక్రాయపేట	24.6
రాజుపాలెం	23.4
పెద్దముడియం	14.8

అమృతం అందేదెప్పుడు?

- ◆ పనులు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం
- ◆ ఇప్పటికే నాలుగుసార్లు గడువు పొడిగింపు
- ◆ ఇదీ కడప నగరంలో దయనీయ పరిస్థితి

–న్యూస్‌టుడే, కడప నగరపాలక

అమృత్ ఫేజ్-1 పథకం కింద కడప నగరపాలక సంస్థకు ఇచ్చిన నిధులు రూ. 43.82 కోట్లు. ఇవి 2016, మార్చి 24న మంజూరయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన జీవీఆర్ ఇన్‌ఫ్రా సంస్థకు పనులు అప్పగిస్తూ 2018, ఫిబ్రవరి 16న ఒప్పందం జరిగింది. రెండేళ్లలో అంటే 2020, ఫిబ్రవరిలోగా పనులు పూర్తిచేయాల్సి ఉంది. గడువులోగా పనులు పూర్తికానందున 2021, ఫిబ్రవరిలో మొదటి సారి, 2022, మార్చిలో రెండో సారి, 2023, మార్చిలో మూడోసారి, 2024, మార్చిలో నాలుగోసారి గడువు పొడిగించారు. అయినప్పటికీ పనులు పూర్తి కాలేదు. బహుశా 2025, మార్చిలో ఐదోసారి గడువు పొడిగించాల్సి రావచ్చు! అమృత్ ఫేజ్-1 పనులు పూర్తి చేయడానికి కావాల్సిన నిధులున్నాయి .. పనులను పర్యవేక్షించడానికి ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈలున్నా గత ఏడేళ్లుగా పనులు పొడిగిస్తూనే ఉన్నారు. ఎవరు ఏమనుకుంటే మాకేమిటి అన్న చందంగా ఇంజినీరింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారు. అమృత్ ఫేజ్-1 పనులను పర్యవేక్షించే కార్యనిర్వాహక ఇంజినీర్ నేనంటే నేను కాదని నగరపాలక ఈఈలు తెగేసి చెప్పడం కడప నగర పాలకసంస్థ ఇంజినీరింగ్ విభాగం పనితీరుకు నిదర్శనం. ఇక్కడ ఇద్దరు ఈఈలున్నారు. వారిలో ఒకరు పనులకు బాధ్యత వహించాలి. కానీ ఇద్దరూ పనులతో సంబంధం లేదంటున్నారు.!



శంకరాపురం కార్మికుల కాలనీలో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకు

ఫేజ్-I పనులివి...

పాతకడప మోడమీదిపల్లి, శంకరాపురం కార్మికుల కాలనీ, ప్రకాశ్‌నగర్ ఎస్సీ హాస్టల్, నకాశ్ పట్టణ ఆరోగ్యకేంద్రం, తిలక్‌నగర్, చిన్నచౌకు పోలీస్ స్టేషన్ల వద్ద 1000 కేఎల్ నుంచి 1200 కేఎల్ నిల్వ సామర్థ్యం గల ఓవర్ హెడ్‌ట్యాంకులు నిర్మించాలి. వీటిలో తిలక్‌నగర్, చిన్నచౌకు పోలీస్‌స్టేషన్ల వద్ద ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు. మిగిలిన నాలుగు చోట్ల పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ట్యాంకుల నిర్మాణం పూర్తయిన అనంతరం వాటిలో నీటిని నిల్వ ఉంచి పరీక్షించాలి. లీకులుంటే మళ్లీ పనులు చేయాల్సి వస్తుంది. పథకం కింద 9,956 మీటర్ల పొడవునా గ్రావీటి లైన్లు వేయాల్సి ఉండగా, 9,400 మీటర్ల మేర పూర్తి చేశారు. ఇప్పటివరకు 2,500 మీటర్ల పైప్‌లైన్లను మాత్రమే పరీక్షించారు. 4000 మీటర్ల మేర పంపింగ్ మెయిన్ వేయాల్సి ఉండగా, దాన్ని పూర్తి చేశారు. 300 మీటర్ల లైన్ మాత్రమే పరీక్షించారు. మొత్తం 55.8 కిలోమీటర్ల పొడవునా డిస్ట్రిబ్యూషన్ లైన్లను వేయాల్సి ఉండగా, 56 కిలోమీటర్లు పూర్తయ్యాయి. పైప్‌లైన్ నిర్మాణంతోపాటు పరీక్షలు పూర్తి చేయకుండా నీటిని సరఫరా చేయడం సాధ్యం కాదు. పరీక్షల సమయంలో పైప్‌లైన్లు లీకేజీలుంటే వాటిని సరిదిద్దడానికి దిద్దుబాటు పనులకు మరింత సమయం కావాలి అమృత్ పథకం కింద కడప నగరంలోని 25వేల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 5,500 కుళాయి కనెక్షన్లు మాత్రమే ఇచ్చారు. మిగిలిన కనెక్షన్లు ఇవ్వడానికి ఎన్నేళ్లు పడుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ప్రజల సమస్యలు కళ్లకు కనిపించవా?

35 నుంచి 45 ఎంఎల్‌డీ మధ్య ఉన్న నీటి సరఫరాను 52 ఎంఎల్‌డీకి పెంచి నగరంలోని అన్ని ప్రాంతాల్లో రోజుకు ఒక్కొక్కరికి 135 లీటర్ల నీటిని సరఫరా చేయాలన్నది అమృత్ పనుల లక్ష్యం. ప్రతి వేసవిలో నగరంలోని కొన్ని ప్రాంతాల ప్రజలకు వారానికొకసారి కూడా నీరివ్వలేకపోతున్నారు. పైపులైన్ల కోసం రోడ్లను తవ్వి వదిలేయడం ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపుతోంది. శంకరాపురం కార్మికుల కాలనీలో దాదాపు ఏడాది కిందట తవ్విన రోడ్లను ఇంతవరకు బాగుచేయకపోవడంతో ఆ ప్రాంతం మురుగుకూపంలా మారింది.

నేను కాదంటే నేను కాదు...

పనుల విషయమై ఈఈ నారాయణస్వామి మాట్లాడుతూ తాను అమృత్ పనులు చూడడం లేదని చెప్పారు. మరో ఈఈ ధనలక్ష్మి మాట్లాడుతూ అమృత్ పనుల బాధ్యత నాది కాదని వివరణ ఇచ్చారు. డీఈఈ స్థాయిలో సమాధానం చెప్పే అధికారి లేక ఏఈఈ అంజలీకుమార్‌ను అడగ్గా ఈ ఏడాది డిసెంబరు నెలాఖరునాటికి పనులు పూర్తికావచ్చుని తెలిపారు.

ఆర్టీసీలో పాత జీవో రద్దు.. సీనియర్లకు ప్రాధాన్యం

స్పందనకు వందనం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఆర్టీసీలో అదనపు బాధ్యతలు అప్పగింత వ్యవహారంలో సీనియర్ల కాదని జూనియర్లకు ఇవ్వడంపై 'ఈనాడు'లో గురువారం 'సీనియర్లకు మొండి చెయ్యి..జూనియర్లకు అదనపు బాధ్యతలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. జీవోను రద్దు చేసి, తిరిగి సీనియర్ల అభిప్రాయాలు తీసుకుని వారికి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కొత్త జీవోను జారీ చేశారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

20న జానమద్ది హనుమచ్ఛాస్త్రి శతజయంతి వేడుకలు

వైవీయూ (కడప), న్యూస్‌టుడే: డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి (బ్రౌన్ శాస్త్రి) శత జయంతి వేడుకలు ఈ నెల 20న కడప నగరంలోని సీపీ బ్రౌన్ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ పేర్కొన్నారు. అలాగే ఈ ఏడాది 13వ గ్రంథాలయ, సాహితీ సేవా పురస్కారాలను తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన పద్మశ్రీ పురస్కార గ్రహీత, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యకు, అనంతపురం జిల్లాకు చెందిన శతావధాన సమ్రాట్ గండ్లూరి దత్తాత్రేయ శర్మకు అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్, విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానం కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పైనేని తులసీనాదం నాయుడు తదితరులు హాజరవుతారని వెల్లడించారు.

కొనసాగుతున్న టెట్

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లావ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) గురువారం కొనసాగింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతల్లో పరీక్ష నిర్వహించారు. మొత్తం 1,490 మందికి 1,310 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ తెలిపారు.

బౌలింగ్‌లో మెరిసి... బ్యాటింగ్‌లో సత్తా చాటి

✦ రంజీట్రోఫీకి ఎంపికైన రఫీ

✦ జిల్లా నుంచి అవకాశం దక్కించుకున్న క్రికెటర్



న్యూస్‌టుడే, కడప క్రీడలు

చిన్నప్పటి నుంచి క్రికెట్టే అతని లోకం. బ్యాట్, బాల్ పట్టుకుని సాధన చేసేవాడు. సరదాలు, షికార్లు పక్కన పెట్టి ఆటే శ్వాసగా మెలిగాడు. అతని లక్ష్య సాధనలో తొలి అడుగు పడింది. దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మకంగా భావించే రంజీ ట్రోఫీలో ప్రస్తుత సీజన్‌కు ఆంధ్రా జట్టులో స్థానం దక్కించుకున్నాడు. అతను మూడోసారి జట్టుకు ఎంపికవడం గమనార్హం. రైట్ ఆర్మ్ ఫాస్ట్ బౌలర్‌గా రాణించడంతో పాటు బ్యాటింగ్‌లోనూ సత్తాచాటుతూ ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకుంటున్నాడు. అతడే కడపకు చెందిన మహమ్మద్ రఫీ.

తండ్రి శిక్షణలో రాటుదేలి..

కడప నగరానికి చెందిన సిరాజుద్దీన్ దౌలా, ఫాతిమున్నీసా దంపతుల కుమారుడు రఫీ. నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో బీబీఎం చివరి ఏడాది చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచి చదువులోనే కాకుండా క్రికెట్‌లో రాణిస్తూ రంజీ స్థాయికి ఎదిగాడు. తండ్రి సిరాజుద్దీన్ దౌలానే అతని మొదటి శిక్షకుడు. ఆయన మార్గదర్శకత్వంలో రాటుదేలాడు. జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. కడప అకాడమీలో చేరిన తర్వాత శిక్షణలో మరింత రాటుదేలి అంచెలంచెలుగా రంజీ జట్టుకు ఎదిగాడు. ఆంధ్రా జట్టులో భాగమవుతూ జట్టులో సుస్థిర స్థానం కోసం నిరంతర సాధన చేస్తున్నాడు.

ఇవీ ఘనతలు

అండర్-12 విభాగంలో తొలిసారి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. తర్వాత అండర్-14, అండర్-16, అండర్-19, అండర్-23, సీనియర్స్ ఇలా అన్ని విభాగాల్లోనూ జిల్లా జట్టులో స్థానం సాధించాడు.

✶ అండర్-23 విభాగంలో పంజాబ్ జట్టుపై సెంచరీ సాధించి సత్తా చాటాడు.

✶ 2019-20లో కేరళ, గుజరాత్, సౌరాష్ట్ర జట్లతో నిర్వహించిన రంజీ పోటీల్లో ఆంధ్రా జట్టు తరపున పాల్గొన్నాడు.

✶ కేరళతో జరిగిన మొదటి మ్యాచ్‌లోనే మొదటి ఇన్నింగ్స్‌లోనే 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీసి సత్తా చాటాడు. గుజరాత్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో మూడు వికెట్లు తీయడంతో పాటు సౌరాష్ట్రతో జరిగిన మూడో మ్యాచ్‌లోనూ మూడు వికెట్లు తీశాడు.

✶ 2021-22లో రంజీ జట్టుకు ఎంపికైనా ఆడే అవకాశం రాలేదు.

✶ ప్రస్తుతం 2023-24 సీజన్‌కు ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

భారత జట్టులో స్థానమే లక్ష్యం : రఫీ



రంజీ జట్టుకు ఎంపికైనందుకు చాలా గర్వంగా ఉంది. కష్టపడిన దానికి ఫలితం దక్కింది. దీనిని కొనసాగించి, భవిష్యత్తులో భారత జట్టుకు ఆడటమే లక్ష్యంగా కృషి చేస్తున్నా. నిరంతర సాధనతో అనుకున్న లక్ష్యం సాధిస్తా.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 మల్టీడే క్రికెట్ టోర్నీలో వైఎస్ ఆర్‌ఆర్-ఏసీఏ స్టేడియంలో కడపతో జరుగుతున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. విశాఖపట్నానికి మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖ జట్టు నిర్ణీత 39 ఓవర్లలో 234/5 స్కోరు చేసింది. రామ్‌చరణ్ 80, వినోద్ 52, తమన్‌రెడ్డి 51 పరుగులు చేయగా, సాయికృష్ణచైతన్య 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 98/4 స్కోరు చేసింది.

✦ కేవోఆర్ఎం మైదానంలో పశ్చిమగోదావరితో మ్యాచ్‌లో తూ.గో జట్టు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యంలో నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన తూ.గో జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 127/5 స్కోరు చేసింది. కార్తీక్ 65, రాజ్‌ఆర్యన్ 20 పరుగులు చేయగా, కార్తీక్ వర్మ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ప.గో జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి నిర్ణీత 25 ఓవర్లలో 99/4 స్కోరు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది.



రామ్‌చరణ్ (80 పరుగులు) కార్తీక్ (65 పరుగులు)

మేకల కాపరి ఆచూకీకి డ్రోన్‌తో గాలింపు



డ్రోన్‌లో గాలింపు చర్యలు చేపట్టిన స్థానికులు

అట్లూరు, న్యూస్‌టుడే : మేకల కాపరి గంగిరెడ్డి ఆచూకీకి నాలుగు రోజులుగా నిర్విరామంగా స్థానికులు గాలిస్తున్నా ఫలితం లేదు. గంగిరెడ్డి ఏమయ్యాడనే ఉత్కంఠ మండలంలో కొనసాగుతుంది. గురువారం మేకల కాపరి కోసం డ్రోన్‌ను తెప్పించి ఆపరేటర్ ద్వారా స్థానికులు వెతకని ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. డ్రోన్ కెమెరాలకు రాత్రి వరకు ఎక్కడా కనిపించకపోవడంతో బంధువులకు నిరాశే మిగిలింది. ట్రాక్టర్ల ద్వారా వరికుంట పంచాయతీ వాసులు అటవీ ప్రాంతంలో, సోమశిల వెనుక జలాల ప్రాంతాల్లో వెతికినా నిరాశే మిగిలింది.

ఒకే ఈతలో రెండు పెయ్య దూడలు



చిన్నమండెం, న్యూస్‌టుడే : అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండల పరిధిలోని సి.పొలిమేరపల్లె గ్రామం కాయలవాండ్లపల్లెలో రైతు శ్రీనివాసులుకు చెందిన సంకరజాతి పాడిఆవు గురువారం ఒకే ఈతలో రెండు పెయ్య దూడలకు జన్మనిచ్చింది. ఈ విషయంపై జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ కె.గుణశేఖరపిళ్లై మాట్లాడుతూ.. లింగనిర్ధారిత వీర్య నాళికలు ఉపయోగించి ఎదసూదులు వేయడం ద్వారా 90శాతం పెయ్య దూడలే జన్మిస్తాయన్నారు. కొన్ని ఆవుల్లో వంశపారం పర్యంగా రెండు దూడలకు జన్మనిస్తాయని స్పష్టం చేశారు.

28న పురోహిత మౌఖిక పరీక్షలు

కడప విద్య, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పురోహిత మౌఖిక పరీక్షలు అక్టోబరు 28న భీమవరం ఆనంద ఫంక్షన్ హాలులో నిర్వహించి, పట్టాలు ప్రదానం చేయనున్నట్లు జిల్లా సమాఖ్య గౌరవాధ్యక్షుడు బి.చంద్రమౌళిశర్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీమూర్తిరాజు సత్యనారాయణశర్మ, శ్రీధరశర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



ప్రసంగిస్తున్న జాయింట్ డైరెక్టర్ విజయ, పక్కన అధికారులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో పిల్లలు, మహిళలు ఎదుర్కొంటున్న కష్టనష్టాలపై ప్రత్యేక దృష్టిసారించి వాటి పరిష్కారానికి, న్యాయం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని చిల్డ్రన్స్ స్కీం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ విజయ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మిషన్ వాత్సల్యపై రాయలసీమ స్థాయి ఉద్యోగులకు రెండు రోజులపాటు జరిగే కార్యశాలను ఆమె ప్రారంభించారు. జేడీ మాట్లాడుతూ అర్హులందరికీ పథకం అందించాలని సూచించారు. ఆర్జేడీ రోహిణి మాట్లాడుతూ పిల్లల హక్కులు, చట్టాలపై ఉద్యోగులకు అవగాహన ఎంతో అవసరమన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, ప్రోగ్రాం మేనేజరు కమల్‌కుమార్, డీసీపీవో సుభాష్‌యాదవ్, ఏవో సురేష్‌చంద్ర, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎస్‌టీఏఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు

కడప విద్య, న్యూస్‌టుడే: పాఠశాలల్లో 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఎఫ్‌ఎల్ఎన్ శిక్షణ తరగతులను రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించడాన్ని రద్దు చేయాలని ఎస్‌టీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు అన్నారు. స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలోనే శిక్షణ నిర్వహించాలని కోరారు. స్థానిక ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ తరగతులను ఈ నెల 21 నుంచి 26వ తేదీ వరకూ ఆరు రోజులపాటు రెసిడెన్షియల్ పద్ధతిలో రాష్ట్రంలో తొమ్మిది కేంద్రాలలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటుచేయనున్నట్లు ఉత్తర్వులు జారీచేసిందన్నారు. వాటిని వెంటనే రద్దు చేయాలన్నారు. దీనివల్ల ఏకోపాధ్యాయ పాఠశాలలోని విద్యార్థులు బోధనకు దూరమయ్యే అవకాశం ఉందని, మహిళా ఉపాధ్యాయులు, అనారోగ్య సమస్యలు, చిన్న పిల్లలున్న మహిళా ఉపాధ్యాయులకు ఇబ్బందిగా ఉంటుందని, ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, క్రిస్టోఫర్ జాన్, ఆలమూరి ప్రసాద్ మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

వేంపల్లె, న్యూస్‌టుడే : గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎన్డీయే ప్రభుత్వం అమలు చేయాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో డిమాండు చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా సూపర్ సిక్స్ పాలసీలు అమలు చేస్తామనడం సరికాదన్నారు. సామాజిక పింఛను మాత్రమే ఇస్తున్నారని మిగిలిన అయిదు పథకాలను త్వరగా అమలు చేయాలని కోరారు.

మరమ్మతుల్లో నాణ్యత కరవు



వర్షాలకు ఉరుస్తున్న గోడలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: జడ్పీ భవనాన్ని రూ.1.60 కోట్లతో ఇటీవల మరమ్మతులు చేపట్టారు. వివిధ విభాగాలకు ప్రత్యేక క్యాబిన్ల ఏర్పాటుతో పాటు, ఛైర్‌పర్సన్ ఛాంబరులోనూ పనులు చేశారు. ఇందుకోసం సుమారు 15 నెలలకు పైగా సమయం తీసుకున్నారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు జడ్పీలో కొన్ని గదుల గోడలు వెలుస్తున్నాయి. గతంలో ఇలా ఉండడంతోనే మరమ్మతులు చేపట్టారు. రూ.కోట్లు ఖర్చు పెట్టి చేసిన పనులు ఇవేనా అని పలువురు పెదవి విరుస్తున్నారు. నాణ్యత లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

పెద్దదర్గా ఉరుసుకు జగన్‌కు ఆహ్వానం



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న దర్గా నిర్వాహకులు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ప్రసిద్ధిగాంచిన కడప పెద్దదర్గా ఉరుసుకు హాజరు కావాలంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేనీ, దర్గా నిర్వాహకులు ఆహ్వానపత్రం అందజేశారు. ఉరుసుకు వస్తానని జగన్ చెప్పినట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. నవంబరు 16న గంధం, 17న ఉరుసు, 18న ముషాయిరా ఉంటాయని పేర్కొన్నారు.

పెన్నానదిలో పెరిగిన నీటి ఉద్ధృతి



సిద్దవటం వంతెన వద్ద పెన్నా పరవళ్లు

సిద్దవటం, ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: పెన్నానది జల హోరుతో ప్రవహిస్తోంది. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. మైలవరం జలాశయం నుంచి దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేశారు. కుందూ నీరు పినాకినిలోకి వచ్చి చేరుతోంది. వల్లూరు మండలం ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట వద్ద గురువారం ఉదయం ఆరు గంటలకు నదిలో 28,940 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా సాయంత్రం ఆరు గంటలకు ఉద్ధృతి మరింత పెరిగింది. దిగువన ఉన్న సోమశిల జలాశయంలోకి 38,300 క్యూసెక్కులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతంలో గ్రామాల్లో ప్రజలను రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తం చేశారు. ఎవరూ నదిలోకి దిగవద్దని హెచ్చరించారు. సిద్దవటం వద్ద పాత వారధిపై నీరు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది.

ఆర్టీపీపీరోడ్డు మీదుగా రాకపోకలు నిలిపివేత

ప్రొద్దుటూరు గ్రామీణ: మైలవరం డ్యాం నుంచి విడుదల చేసిన 8 వేల క్యూసెక్కుల కృష్ణమ్మ జలాలు ఉద్ధృతంగా ప్రవహించడంతో పెన్నా మీదుగా రామేశ్వరం-ఆర్టీపీపీరోడ్డు మార్గంలో రాకపోకలను గురువారం నిలిపేశారు. ఎర్రమట్టిరోడ్డుపై అడుగుపైనే నీటి ప్రవాహం ఉన్నందున వాహనాలు వెళ్లకుండా రెవెన్యూ సిబ్బంది జేసీబీతో గుంతలను ఏర్పాటు చేశారు. పెన్నాలో మైలవరం జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో గ్రావెల్ రోడ్డు దెబ్బతినడంతో గుంతలుపడ్డాయి. దీంతో చేసేదేమి లేక పొట్లదుర్తి మీదుగా వెళ్లడంతో దూరభారం, సమయం వృథా అవుతోందని వాహనదారులు పెదవివిరుస్తున్నారు.



రామేశ్వరం-ఆర్టీపీపీ మార్గంలో మైలవరం జలాలు

ఇంక్రిమెంట్ల కోత

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక కమిషనర్‌గా గతంలో పనిచేసిన పీవీవీఎస్ మూర్తితోసహా పట్టణ ప్రణాళిక విభాగ ప్లానింగ్ సూపర్‌వైజర్ సి.టి.కృష్ణాసింగ్, బిల్డింగ్ ఆఫీసర్ ఎస్.మహబూబ్‌బాషాలకు ఇంక్రిమెంట్లలో రెండేసి వంతున కోత విధిస్తూ పురపాలక వ్యవహారాలు, పట్టణాభివృద్ధి రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఆదేశాలు జారీ చేసిన కాపీ గురువారం పురపాలక కార్యాలయానికి చేరింది. 2021లో కమిషనర్ అయిన ఆయన భవన నిర్మాణాలకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చారని, అనధికార నిర్మాణాల తొలగింపు విషయంలో చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని, సెట్ బ్యాక్ నిబంధనలను అతిక్రమించినా పట్టించుకోలేదనే అభియోగాలతో విజిలెన్స్ అధికారుల నివేదిక ప్రకారం ఆయనకు గతంలో పురపాలక వ్యవహారాలు, పట్టణాభివృద్ధి అధికారులు నోటీసులు జారీ చేశారు. దీనిపైన కమిషనరు ఇచ్చిన సంజాయిషీలు విచారణలో నిలవకపోవడంతో చివరికి రెండు వార్షిక ఇంక్రిమెంట్లలో కోత విధించాలని నిర్ణయించి ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే అభియోగాలతో అప్పట్లో టీపీఎస్ సి.టి.కృష్ణాసింగ్, టీపీబీవో ఎస్.మహబూబ్‌బాషాలపై కూడా నిర్ధారణ కావడంతో ఇరువురి ఇంక్రిమెంట్లలో రెండేసి వంతున కోత విధించారు.

జలవనరులశాఖలో అదనపు బాధ్యతలు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లా జలవనరులశాఖలో పలువురికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. తెలుగుగంగ విభాగం బద్వేలులో ఈఈగా పనిచేస్తున్న శేషుబాబుకు క్వాలిటీకంట్రోలు సీఈ సర్కిల్ కడప విభాగం ఎస్‌ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జీకేఎల్ఐ సబ్‌డివిజన్‌లో డీఈగా పనిచేసే శ్రీనివాస్‌కు జీఎన్ఎస్ఎస్ సర్కిల్ ఈఈగా, టీజీపీ క్వాలిటీ కంట్రోల్ విభాగం లింగంగుంట్ల డీఈగా పనిచేసే వెంకటేశ్వరప్రసాద్‌ను టీజీపీ క్వాలిటీ కంట్రోలు-1 డివిజన్ ఈఈగా బాధ్యతలు ఇచ్చారు.

జిల్లాలో 124 మద్యం దుకాణాలు ప్రారంభం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా తొమ్మిది ఎక్సైజ్ ఠాణాల పరిధిలో 139 మద్యం దుకాణాలకు గాను 124 దుకాణాలు ప్రారంభమయ్యాయి. మరో 15 దుకాణాలు ప్రారంభించాల్సి ఉంది. కొన్ని చోట్ల గదులు దొరకడం లేదు. మరికొన్ని చోట్ల బలవంతంగా వేరే దుకాణాలుంటే వారిని ఖాళీ చేయిస్తున్నారు. కడప నగరంలో అలాంటి రెండు ఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతానికి 139 మంది దుకాణదారులకు తాత్కాలిక లైసెన్సులిచ్చారు. ఇవి ఈనెల 22 వరకు అమల్లో ఉంటాయి. తర్వాత రెగ్యులర్ లైసెన్సులు జారీ చేస్తారు. నిబంధనలు పాటించకుండా దుకాణాలు ఏర్పాటుచేస్తే అనుమతివ్వబోమని అధికారులు పేర్కొన్నారు.

బిల్లులు చెల్లించాలని గుత్తేదారుల నిరసన

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే పనులు చేస్తామని డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో గుత్తేదారులు నిరసన తెలిపారు. ఈ విషయంపై ఆర్టీపీపీ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సీఈ గౌరీపతిని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దాదాపు గత 9 నెలలుగా ఆర్టీపీపీలో చేసిన పనులకు బిల్లులు రావడం లేదన్నారు. పూర్తి అయిన పనులకు ఒప్పందాలు కూడా చేయడం లేదన్నారు. ఆర్థికంగా తామంతా ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ప్రస్తుతం 5వ యూనిట్‌కు ఓవర్‌ఆయిలింగ్ నిర్వహిస్తున్నామని తమకు బిల్లులు చెల్లిస్తేనే ఆ పనులను చేస్తామని సూచించారు.

అధ్వాన దారులు... ఎన్నాళ్లీ అవస్థలు



అధ్వాన రహదారులపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. గత అయిదేళ్ల వైకాపా పాలనలో గ్రామీణ, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి మార్గాల నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో ప్రస్తుతం వర్షాలతో గుంతల్లో వర్షపు నీరు నిలిచింది. కడప-రేణిగుంట జాతీయ రహదారిలో సిద్దవటం మండలం భాకరాపేట శివారు నుంచి ఒంటిమిట్ట వరకు రోడ్డు నెర్రెలిచ్చింది. కొన్ని చోట్ల వాన పోటుకు గుంతలు ఏర్పడటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. టక్కోలు, మాచుపల్లె, లింగంపల్లె, పి.కొత్తపల్లికు వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. నరసన్నగారిపల్లె-దర్జిపల్లి మార్గం కూడా ఛిద్రమైంది. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట, సిద్దవటం

ఉచిత శిక్షణ... భవితకు నిచ్చెన

సింహాద్రిపురం, లింగాల, న్యూస్‌టుడే : ఉన్నత చదువులు చదివి మంచి కొలువులు సాధించిన తర్వాత తమ కుటుంబాలు బాగుంటే చాలని చాలా మంది అనుకుంటారు. అలా కాకుండా గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు కొలువులు సాధించేందుకు ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇస్తూ వారి జీవితాలను మలుపు తిప్పుతున్నారు పులివెందుల నియోజకవర్గానికి చెందిన పలువురు మహిళా ఉపాధ్యాయులు.

● పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ చదివేందుకు పాలిసెట్ రాయాలి. ఇందులో శిక్షణ తీసుకోవాలంటే రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. పేద విద్యార్థులకు ఇది అదనపు భారమే. ఈ నేపథ్యంలో పైసా ఖర్చు లేకుండా వేసవి సెలవుల్లో పాలిసెట్, ఏపీఆర్జేసీ ప్రవేశ పరీక్షల కోసం ఉచిత శిక్షణ ఇస్తున్నారు. స్నేహిత అమృత హస్తం సంస్థ అధ్యక్షుడు మొమ్మెల రాజు చొరవతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన 39 మంది ఉపాధ్యాయులతో 2010లో వేసవి సెలవుల్లో శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఇందులో డిగ్రీ కళాశాల అధ్యాపకులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. నలుగురు మహిళా ఉపాధ్యాయులు ఇందులో భాగస్వామ్యమయ్యారు.

● బృందంలోని వారంతా నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వేసవి సెలవులంటే కొంత మంది ఉపాధ్యాయులు విహారయాత్రలకు సమయాన్ని కేటాయిస్తుంటారు. ఈ ఉపాధ్యాయ బృందం మాత్రం ఎక్కడ పనిచేసినా ఇవన్నీ త్యాగం చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 4,600 మంది ప్రవేశ పరీక్షలకు హాజరుకాగా 1,600 మంది వివిధ కొలువులు సాధించారు. వీరి శిక్షణలో పాలిసెట్‌లో రాష్ట్రస్థాయిలో ఓ విద్యార్థి 53వ ర్యాంకు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారు.



విద్యార్థినికి అవార్డు అందజేస్తున్న ప్రొఫెసర్ శేష మహేశ్వరమ్మ

ఆనందంగా ఉంది

మాది పులివెందుల పట్టణం. కడప సమీపంలోని చిన్నమాచుపల్లె ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నాను. వేసవి సెలవుల్లో పులివెందులకు వచ్చి ఉపాధ్యాయ బృందంతో కలిసి విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. పేద విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ఆనందంగా ఉంది.

- అరుణ, గణిత ఉపాధ్యాయురాలు



పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు శ్రీదేవి

శిక్షణ ఇవ్వడం సంతోషానిచ్చింది

సింహాద్రిపురం మండలం అంకాళమ్మగూడూరు ఉన్నత పాఠశాలలో గణితం ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నాను. 2010 నుంచి విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. వేసవి సెలవుల్లో పేద విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు సమయం కేటాయిస్తున్నాను. విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం సంతోషానిస్తోంది. - శ్రీదేవి

అత్యధికులు కొలువులు సాధించారు

2012 నుంచి పదో తరగతి పరీక్షల అనంతరం పాలిసెట్ ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నాం. శిక్షణలో భాగంగా వేసవి సెలవుల్లో రసాయనశాస్త్రం బోధిస్తున్నా. ఇప్పటి వరకు చాలా మంది విద్యార్థులు శిక్షణకు హాజరయ్యారు. అత్యధికులు ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు సాధించి కొలువులు సాధించారు.

- శేషమహేశ్వరమ్మ, జేఎన్‌టీయు ప్రొఫెసర్

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా పోలీసుశాఖ అధికారి హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రామాయణం స్ఫూర్తితో మానవత విలువలను పెంపొందించుకోవాలన్నారు. ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు ఆనంద్, టైటాస్, శ్రీశైలరెడ్డి, జిల్లా పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్ తదితరులున్నారు.

రైల్వే ఉద్యోగి బలవన్మరణం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులో మధుసుదన్ (34) అనే రైల్వే ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారని గురువారం ఒకటో పట్టణ పోలీసులు పేర్కొన్నారు. సీఐ మనోహర్ వివరాల మేరకు.. ప్రొద్దుటూరు మండలం లింగాపురానికి చెందిన మధుసూదన్ గుంతకల్లులోని రైల్వే సీనియర్ డీసీఎం కార్యాలయంలో సీనియర్ క్లర్క్‌గా పని చేస్తున్నారు. రెండు రోజుల కిందట కార్యాలయ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఇతను చర్చి స్కూల్ రోడ్డులో బ్యాడ్మింటన్ కోర్టు ఎదురుగా ఉన్న రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. నాలుగేళ్ల కిందట మొదటి భార్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరికి 11 ఏళ్ల మనుశ్రీ కుమార్తె ఉంది. రెండేళ్ల కిందట బళ్లారికి చెందిన హేమవతిని రెండో పెళ్లి చేసుకున్నారు. ఆమె సాఫ్ట్‌వేరు ఇంజినీరుగా పని చేస్తున్నారు. దసరా పండగకు ప్రొద్దుటూరుకు వెళ్దామని భర్త పిలిచినా ఆమె రాకపోవడంతో అతను ఒక్కడే ఊరు వెళ్లి వచ్చారు. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో ఒకరినొకరు మాట్లాడుకోవటం లేదు. ఈక్రమంలో బుధవారం రాత్రి పడక గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నారు. ఉదయం తలుపు తీయకపోవడంతో భార్య, స్థానికులు సహకారంతో తలుపును బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా అతను ఫ్యానుకు ఉరి వేసుకున్నాడని పోలీసులు వివరించారు. మృతదేహానికి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

పంచాయతీల అభివృద్ధికి కృషి



సిమెంటు రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రితేష్‌రెడ్డి, నాయకులు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పల్లెపండగ కార్యక్రమం చేపట్టిందని బద్వేలు తెదేపా నియోజకవర్గం సమన్వయకర్త రితేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని చల్లగిరిగెల పంచాయతీలో ఎంపీడీవో రమణారెడ్డి ఆధ్వర్యంలో పల్లెపండగ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీకి మంజూరైన నిధులతో సిమెంట్ రహదారికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.... గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తామని తెలిపారు. పంచాయతీకి మంజూరైన వివిధ పనులను ఈ కార్యక్రమంలో ప్రారంభించారు. మండల నాయకుడు కృష్టారెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సీటీవోగా రవికుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు వాణిజ్యపన్నుల శాఖ రెండో సర్కిల్ సీటీవోగా రవికుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా గ్రామీణ సీటీవోగా విధులు నిర్వహిస్తూ కొద్ది రోజుల కిందట బాధ్యతలు చేపట్టారు.

మద్యం దుకాణం వద్దని మహిళల ఆందోళన



నినాదాలు చేస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు పట్టణం: స్థానిక వసంతపేటవీధి సాయిబాబాకొట్టాలకు చెందిన మహిళలు తమ వీధిలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని గురువారం సాయంత్రం ఆందోళన చేశారు. మద్యం ప్రియుల చేష్టలతో నివాసాల ప్రాంతాల మహిళలు, విద్యార్థినులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. తమ నివాసాలకు సమీపంలో సాయిబాబా దేవాలయం ఉందన్నారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని కలెక్టరేట్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి వచ్చినట్లు మహిళలు తెలిపారు. మహిళా చైతన్య సమాఖ్య జిల్లా కన్వీనర్ పద్మ, మహిళాశక్తి కన్వీనర్ లక్ష్మీదేవి హరిత, జింకా సుబ్బయ్య, పార్వతి, విజయ, చంద్రశేఖర్ ఉన్నారు.

తూకాల్లో మోసాలు... జేబుకు చిల్లులు

ఫిర్యాదులొస్తేనే కదులుతున్న అధికారులు

– న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు

◆ పులివెందులలో అయిదు ప్రభుత్వ చౌకదుకాణాల్లో కాటాలు తూకం తక్కువ ఉండడంతో కేసు నమోదు చేసి రూ.10 వేలు అపరాధ రుసుం కట్టించుకున్నారు. ◆ మైదుకూరు నియోజకవర్గంలోని చాపాడులో రైతు దగ్గర నుంచి పత్తిని కొనుగోలు చేసే దళారి తూకంలో మోసం చేస్తుండడం బయట పడటంతో రూ.50 వేలు జరిమానా విధించారు. ◆ ప్రొద్దుటూరు ఎన్వీ రమణ ఎలక్ట్రికల్ దుకాణంలో తనిఖీ చేయగా పానసోనిక్ ఎలక్ట్రిక్ కుక్కర్‌లో ఫంకా పరిమాణంలో లేకపోవడంతో ముంబయిలోని ఆ కంపెనీ ద్వారా రూ.75 వేలు జరిమానా కట్టించుకున్నారు. ◆ జమ్మలమడుగులో ఎరువుల దుకాణంలో తనిఖీ చేయగా ఫాస్ఫేట్ ఎరువు తూకం తక్కువ ఉన్నట్లు తేలగా రూ.లక్ష జరిమానా విధించారు.



పండ్ల వ్యాపారి వద్ద త్రాసును తనిఖీలు చేస్తున్నారిలా

పులివెందుల నియోజకవర్గాల్లోని 16 మండలాలతోపాటు ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు ప్రాంతాల్లో మార్కెట్‌లో ఏ వస్తువు కొనుగోలు చేసినా వినియోగదారులు నిలువునా మోసపోతున్నారు. నిత్యావసర సరకులు తూకం వేసే పరికరంలో తక్కువ బరువు తూగేలా అమర్చి ఏమార్చుతున్నారు. అధునాతన విధానం అందుబాటులోకి వచ్చిన కొద్దీ వాటికి రెట్టింపుగా కనుమరుగు చేసే ప్రయత్నాలు వ్యాపార రంగంలో చోటుచేసుకుంటున్నాయి. వ్యాపారులు చేతివాటాన్ని ప్రదర్శించి నిర్దేశించిన నగదును తీసుకున్నా అందుకు అనుగుణంగా సరకు ప్రజలకు ఇవ్వడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. వీటిని నియంత్రించేందుకు సంబంధిత శాఖ అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది. పలానా ప్రాంతంలో తాము మోసపోతున్నామని ప్రజలు కూడా సంబంధిత కార్యాలయానికి ఫోన్‌చేసి సమాచారం ఇస్తున్నారు. ఈక్రమంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఇలా ప్రతి వస్తువు క్రయ, విక్రయాలపై మోసం జరుగుతుండడంతో వినియోగదారుడు నిట్ట నిలువునా దోపిడీకి గురవుతున్నారు. లీగల్ మెట్రాలజీ అధికారులు ఫిర్యాదు కోసం ఎదురు చూడక స్వయంగా తనిఖీలు చేస్తే మోసాలకు కళ్లెం వేయవచ్చునని వినియోగదారులు కోరుతున్నారు.

సంవత్సరం	ముద్ర రుసుం (రూ.లక్షల్లో)	జరిమానా (రూ.లక్షల్లో)	కేసులు
2022-23	11.46	12.24	208
2023-24	12.36	13.50	218
2024-25	05.63	07.22	089

ప్రశ్నిస్తేనే మోసానికి కళ్లెం

వస్తువు క్రయ, విక్రయాలు చేసే ముందు వినియోగదారుడు అప్రమత్తంగా ఉండాలి. తూనికలు, కొలతల్లో ఏదేని అనుమానం కల్గిన వెంటనే ప్రశ్నించాలి. తమకు ఫోను (9490210543) చేయాలి. కమీషన్ ఏజెన్సీలు (దళారీలు) రైతులను మోసం చేసేందుకు కొత్త విధానాన్ని అవలంబిస్తున్నారు. ధాన్యం కొనుగోలులో దళారి రిమోట్ సిస్టమ్‌ను వాడుతున్నట్లు వినికిడి. రైతులు జాగ్రత్తగా ఉండాలి. **- జయదేవ్, ప్రొద్దుటూరు తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్**

పోలీసుల కవాతు



ప్రత్యేక బృందంతో కవాతు చేస్తున్న పోలీసులు

ముద్దనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో ప్రత్యేక పోలీసులు గురువారం కవాతు నిర్వహించారు. సిఐ దస్తగిరి మాట్లాడుతూ టౌన్‌లోని ప్రజలకు శాంతి భద్రతలపరంగా భరోసా కల్పించేందుకు పాత బస్టాండ్ వద్ద నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు కవాతు నిర్వహించామన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయుల వర్ధంతి

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయుల వర్ధంతిని పోరుమామిళ్లలో బలిజసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోరుమామిళ్ల చెరువు వద్ద గురువారం శ్రీకృష్ణదేవరాయుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రచయిత బొల్లు రామ మోహన్, బలిజ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన తెదేపా నేత

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి కలిశారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం భేటీ అయ్యారు. ప్రొద్దుటూరులో వైద్యకళాశాల ఏర్పాటుపై చర్చించామన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి



గోడపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: కడపలో విభజన చట్టం హామీ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం బద్వేలులోని సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లా 12వ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు కింది పిల్ల కాలువలు పూర్తి చేసి రైతుల పొలాలకు నేరుగా నీటిని ఇవ్వాలన్నారు. గాలేరు-నగరి ప్రధాన కాలువను పూర్తి చేసి చెరువులకు నీరందించి పంట కాల్వలను ఏర్పాటు చేయాలన్నారు. రాజోలి రిజర్వాయర్‌ను సత్వరం పూర్తి చేసి కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయాలని పేర్కొన్నారు.

వర్షానికి కూలిన ఇంటి పైకప్పు



ముద్దనూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిన్నకత్తెరపల్లె గ్రామంలో వర్షాల కారణంగా బుధవారం రాత్రి బట్టు రమణయ్య ఇంటి శ్లాబ్ కూలింది. ఇటీవల వరుసగా కురిసిన వర్షాలతో ఆయన ఇల్లు బాగా దెబ్బతింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఎవరూ లేనందున ఏమీ జరగలేదని, ఆస్తినష్టం కలిగిందన్నారు. గంగాదేవిపల్లెకు చెందిన జగదీశ్వర్‌రెడ్డి ఇంటి గోడల్లో వర్షపు నీరు దిగి గోడ కూలింది.

పంటల నష్టం... అన్నదాతలకు కష్టం

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంతో పల్లెల్లో పంటపొలాలు, పట్టణాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి. గురువారం ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గ మండలాల్లో వరుణుడి ధాటికి దెబ్బతిన్న ఆస్తులను చూపి ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల వాగులు పొంగి రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. ముద్దనూరులోని చింతకుంట గ్రామంలో ఉల్లి, మినుము పంట పొలాలు నీటమునిగాయని రైతులు రవి, సుబ్బయ్య, శ్రీను, బాలుడు ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో దాదాపుగా 90 ఎకరాల పంట దెబ్బతినడంతో జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్.ఎస్.వి.సుభాషిణి ఎర్రగుంట్ల మండలంలో పరిశీలించారు. ఎర్రగుంట్ల పట్టణంలోని సుందరయ్య నగర్‌లో నీరు రోడ్లపైన ప్రవహిస్తూ ఇళ్లలోకి చేరింది. **- న్యూస్‌టుడే, క్లస్టరు బృందం**



పోరుమామిళ్లలో దెబ్బతిన్న వరి పంట



నరసాపురంలో మిరప తోటలో నిలిచిన నీరు



ముద్దనూరులో నీటమునిగిన ఉల్లిపంటను చూపిస్తున్న రైతు



ఎర్రగుంట్ల సుందరయ్య నగర్‌లో ఇంటిలోకి చేరిన నీటిని తోడుతూ...



నిండుకుండలా దిగువ సగిలేరు జలాశయం



ప్రొద్దుటూరులో కాకిరేనిపల్లె వద్ద దెబ్బతిన్న తారురోడ్డు

భూపేష్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సమక్షంలో కేకు కోస్తున్న తెదేపా నియోజకవర్గ బాధ్యుడు భూపేష్‌రెడ్డి



దత్తాపురంలో బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు

జమ్మలమడుగు, కొండాపురం, న్యూస్‌టుడే: జమ్మలమడుగు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తన పుట్టిన రోజు వేడుకను విజయవాడలో ఘనంగా జరుపుకొన్నారు. గురువారం విజయవాడలోని ఓ హోటల్లో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సమక్షంలో కేకుకోయగా పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొండాపురం మండల తెదేపా క్లస్టర్ బాధ్యుడు గోరిశెట్టి బాబు ఆధ్వర్యంలో ముద్దనూరు మండలం కోడిగాండ్లపల్లె గ్రామంలోని ఏసు కరుణాలయంలోని మానసిక దివ్యాంగులకు అన్నదానం, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, తోటశివ, సత్య, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. దత్తాపురం గ్రామంలో తెదేపా యువ నాయకుడు బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. జమ్మలమడుగు తెదేపా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో కేకు కోసి భూపేష్‌రెడ్డి కటౌట్‌ను పట్టణంలో ఊరేగించి పాత బస్టాండ్‌లో పాలాభిషేకం చేశారు. దుద్యాల రమేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో 50 మంది రక్తదానం చేశారు. టౌన్ చర్చిలో క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో కేకు కోశారు. కొండాపురంలో తెదేపా మండల మహిళా అధ్యక్షురాలు చామల పద్మజ, పెద్దముడియంలో తెదేపా నాయకులు గడ్డం అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకొన్నారు.



దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న తెదేపా క్లస్టర్ బాధ్యుడు గోరిశెట్టిబాబు

ఇంధన ఖర్చులు తగ్గించుకోవచ్చు

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: పెట్రోలు మోటారు సైకిల్‌లో పోల్చితే బజాజ్ ఫ్రీడం సీఎన్‌జీ మోటారు సైకిల్‌తో ఇంధన ఖర్చును గణనీయంగా తగ్గించవచ్చని పోరుమామిళ్లకు చెందిన ఆర్‌కే బజాజ్ నిర్వాహకులు ఆర్‌కే బ్రదర్స్ తెలిపారు. గురువారం పోరుమామిళ్ల పట్టణంలో ఆర్‌కే బజాజ్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా షోరూంలో నూతన వెహికల్‌ను ఎస్సై కొండారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. రెండు కేజీల సీఎన్‌జీతో 200 కిలోమీటర్లు వస్తుందని తెలిపారు. సీఎన్‌జీ అయిపోతే దీనిలో అదనంగా రెండు లీటర్ల పెట్రోలు ట్యాంకు ఉంటుందని తెలిపారు.



పోరుమామిళ్లలో నూతన వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై కొండారెడ్డి, నిర్వాహకులు

చారిత్రక ఆనవాళ్లు... పర్యవేక్షణ లేక కనుమరుగు

హంపి పీఠాధిపతి సమాధి అయినట్లు చరిత్ర | అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఆధ్యాత్మిక ప్రాంతం



సమాధి పరిసరాలు పరిశీలిస్తున్న పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

– న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

జమ్మలమడుగు ప్రాంతం పర్యాటకంగానే కాకుండా చారిత్రకంగా ఎంతో పేరొందింది. ఆనాటి చరిత్ర ఆనవాళ్లు నేటికీ కళ్ల ముందు దర్శనమిస్తుంటాయి. జిల్లాలోని అత్యంత పర్యాటక ప్రాంతమైన గండికోటలో రాజులు, నవాబుల పాలన కాలంలో నిర్మించిన కట్టడాలు, దేవాలయాలు మాత్రమే చాలా మందికి తెలుసు. కానీ గండికోటలో ఆధ్యాత్మికత పెంపొందించాలని జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష మహాసంస్థాన పీఠాధిపతి శ్రీ విద్యాశంకర భారతి స్వామి 1720 సంవత్సరంలో అప్పటి విజయనగర సామ్రాజ్యంలో అంతర్భాగమైన గండికోట పర్యటనకు వచ్చి సిద్ధి పొంది సమాధి అయినట్లు చరిత్ర చెబుతోంది. గండికోటలోని నాగజరీ కోన వద్ద ఉన్న ఈయన సమాధిని సందర్శించడం కోసం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. గ్రామ ప్రజలు మాఘమాసంలో అక్కడి చేరుకొని కోనేటిలో పవిత్ర స్నానం ఆచరించి పూజలు చేస్తుంటారు. అంతటి పవిత్రమైన ప్రదేశం ఇప్పుడు అధ్యాత్మిక కార్యక్రమాలు జరగక అసాంఘిక కార్యక్రమాలతో కళావిహీనంగా మారింది. గతేడాది గండికోటకు వచ్చిన ప్రస్తుత పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి నాగజరీ కోన వద్ద ఉన్న విద్యాశంకర భారతి స్వామి సమాధిని సందర్శించి ఇక్కడ అధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. రోజురోజుకు మరుగునపడిపోతున్న చారిత్రక ఆనవాళ్లపై అధికారులు, పాలకులు దృష్టి సారించి అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.



విద్యాశంకర భారతి సమాధి అయిన చోట ఇలా...

జూదరుల అరెస్టు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని రాణీవనం విద్యుత్తు ఉపకేంద్రం సమీపంలో జూదం ఆడుతున్న అయిదుగురు జూదరులపై కేసు నమోదు చేసినట్లు గురువారం ఎర్రగుంట్ల పోలీసులు తెలిపారు. వీరి నుంచి రూ.52,200 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

భావితరాలకు మార్గదర్శి వాల్మీకి మహర్షి

ప్రొద్దుటూరు క్లస్టర్ బృందం : స్థానిక కొత్తపల్లె కూడలి వద్ద వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి గురువారం పూలమాల వేశారు. సీతారాముల ఘనత, ప్రాశస్త్యం చాటిచెప్పిన రామాయణంలో భారతీయ సాంస్కృతిక విశిష్టతను తెలియజేసిన ఆది కవి వాల్మీకి భావితరాలకు చిరస్మణీయులు, మార్గదర్శకులని కొనియాడారు. వాల్మీకి సంఘ అధ్యక్షుడు ఆంజినేయులు మాట్లాడుతూ ఎస్టీలుగా గుర్తింపుతోపాటు అధికారికంగా కుల ధ్రువీకరణ మంజూరు చేయాలని డిమాండు చేశారు. వాల్మీకి సంఘం గౌరవ అధ్యక్షుడు సంజీవరాయుడు, కార్యదర్శి రామ్‌గోపాల్, సలహాదారు బాలనారాయణ, వెంకటసుబ్బయ్య, వెంకట గురవయ్య, తెదేపా నాయకులు పాల్గొన్నారు. ప్రొద్దుటూరు కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సురేష్‌నాయుడు, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, వాల్మీకి సంఘ అధ్యక్షుడు, రిటైర్డ్ ఎస్ఐ ఆంజనేయులు, కర్యాదర్శి రామ్‌గోపాల్, గౌరవసలహాదారుడు బాల నారాయణ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వాల్మీకి యువసేన గౌరవాధ్యక్షుడు నల్లబోతుల నాగరాజు వాల్మీకి విగ్రహానికి పూలమాలవేసి ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, పక్కన సంఘ నాయకులు



బ్రహ్మంగారిమఠంలో ర్యాలీ చేస్తున్న స్థానికులు



జమ్మలమడుగులో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, వాల్మీకి సేవా సమితి నాయకులు

ప్రగతికి బాటగా... పల్లెకు పండగ

రూ.11.51 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు



టి.కొత్తపల్లెలో ప్రహరీకి నోచుకోని ప్రాథమిక పాఠశాల భవనం

– న్యూస్‌టుడే, మైదుకూరు

వైకాపా అయిదేళ్ల పాలనలో అభివృద్ధికి నోచుకోక నిర్లక్ష్యానికి గురైన పల్లెలకు మహర్దశ పట్టింది. పండగ వాతావరణం మధ్య గ్రామాల్లో అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సంఘం నిధులను వైకాపా ప్రభుత్వం పక్కదారి పట్టించి పంచాయతీలను కుదేలు చేయగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జనసత్వాలు కల్పించేలా చర్యలు చేపట్టింది. పల్లెల రూపురేఖలు మార్చేలా నాంది పలికింది. పల్లెపండుగ ప్రగతికి అండగా అంటూ పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలతో పనులు ప్రారంభిస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ యంత్రాంగం ఆ దిశగా అడుగులు వేస్తోంది. మైదుకూరు నియోజకవర్గానికి పంచాయతీరాజ్ శాఖ కింద గ్రామాల్లో సిమెంట్‌రోడ్లు, మురుగుకాలువలు, గ్రావెల్‌రోడ్లు, తారురోడ్లు, ప్రహరీలు నిర్మించనున్నారు. రూ.11.51 కోట్లతో 203 పనులు చేపట్టనున్నారు. రూ.8.47 కోట్లతో సిమెంట్‌రోడ్లు, రూ.1.28 కోట్లతో గ్రావెల్‌రోడ్లు, రూ.1.20 కోట్లతో తారురోడ్లు, రూ.0.56 కోట్లతో ప్రహరీలు నిర్మించనున్నారు. పనులు సకాలంలో పూర్తి చేయగలిగితే పల్లెలో ప్రగతి కళ కనిపించనుంది. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలు నెరవేరనున్నాయి.

మండలాల వారీగా మంజూరైన పనులు

మండలం	పనులు	నిధులు (రూ.కోట్లలో)
మైదుకూరు	47	2.18
దువ్వూరు	43	2.62
ఖాజీపేట	38	1.88
బీమఠం	22	2.97
చాపాడు	53	1.86



మైదుకూరు మండలం వనిపెంటలో రోడ్డు దుస్థితి

రహదారి బాగు చేయాలని వినూత్న నిరసన

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని గుంతలున్న రహదారికి మరమ్మతులు చేయించాలని సీపీఎం నాయకుడు భైరవ ప్రసాదు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారికి సాయిబాబా ఆలయం వద్ద వర్షం నీరు చెరువులా తలపిస్తుంది. ఈ ప్రాంతంలో వరినాట్లు వేసి తమ నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకుడు పిడుగు మస్తాన్, సునీల్‌కుమార్, కేశవ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల- విజయవాడ ప్రధాన రహదారిని పరిశీలించారు.



గుంతలో వరినాట్లు వేస్తున్న సీపీఎం నాయకులు

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

కమలాపురంలో పోలీసుల స్వచ్ఛసేవ



యువకులతో కలిసి వాలీబాల్ ఆడుతున్న సీఐ రోషన్

కమలాపురం, న్యూస్‌టుడే : ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు సీఐ రోషన్, ఎస్సై ప్రతాప్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి గురువారం బహిరంగంగా మద్యం తాగే ప్రాంతాలను శుభ్రం చేయించి క్రీడామైదానాలుగా తీర్చిదిద్దారు. పట్టణ పరిధిలోని పాడిఖానా, రైల్వే స్టేషన్, గవార్ పెట్రోల్ బంక్, పుత్తా కళాశాల, కోగటం రోడ్డు తదితర బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా ప్రాంతాల్లోని కంపచెట్లు, పిచ్చి మొక్కలను యంత్రం సాయంతో తొలగించి శుభ్రం చేయించి క్రీడామైదానాలుగా సిద్ధం చేశారు. అనంతరం స్థానిక యువతతో సీఐ, ఎస్సై వాలీబాల్ ఆడి యువతను ప్రోత్సహించారు.

రూ.10 నాణేల చెల్లుబాటుపై అవగాహన

కడప ఏడురోడ్లు : రూ.10 నాణేల చెల్లుబాటుపై యూనియన్ బ్యాంకు అధికారులు గురువారం కడప రైతుబజార్‌లో అవగాహన కల్పించారు. అవసరమైన వారికి నాణేలను అందజేశారు. యూనియన్ బ్యాంక్ చెస్ట్ మేనేజరు శ్రీకాంత్, బ్యాంకు అధికారి గురుదయ్య మాట్లాడుతూ వీటి చెల్లుబాటుపై ఎటువంటి అపోహలొద్దన్నారు. వ్యాపారులు తీసుకోకపోతే చట్టపరమైన చర్యలకు బాధ్యులు అవుతారన్నారు. కరపత్రాలను రైతుబజార్‌లోని కూరగాయల దుకాణాల వద్ద అతికించారు.



వినియోగదారులకు నాణేలు అందజేస్తున్న యూనియన్ బ్యాంకు అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప: 8008573428, 8074174832
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

?: గురివాలలోని ప్రధాన రోడ్డుపైకి మురుగునీరు చేరుతోంది. రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంది. - **వెంకటరెడ్డి, స్థానికుడు**

✓: కార్మికులను పంపించి పరిష్కరిస్తాం. - **కృష్ణమూర్తి, ఎంపీడీవో**

?: సింహాద్రిపురంలోని బుద్ధయ్యపాలెం సమీపంలో రోడ్డుపై నీరు నిలిచి బురదమయంగా మారుతోంది. వాహనదారులు అదుపుతప్పి కిందపడుతున్నారు. - **బాషా, స్థానికుడు**

✓: రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం. - **వెంకట్రాముడు, ఈవోపీఆర్డీ - న్యూస్‌టుడే, సింహాద్రిపురం**

ఆదాయం జాస్తి... వసతులు నాస్తి

ఇదీ కడప ఆర్టీసీ బస్టాండు దుస్థితి

న్యూస్‌టుడే, కడప చిన్నచౌకు



కడప ఆర్టీసీ బస్టాండు

జిల్లా కేంద్రమైన కడప ఆర్టీసీ డిపోకు రోజుకు రూ. లక్షల్లో ఆదాయం వస్తుంది. దీంతో పాటు బస్టాండు, పరిసర ప్రాంతాల్లోని దుకాణాల నుంచి ప్రతి నెలా సుమారు రూ.కోటి మేర సొమ్ము సమకూరుతుంది. ఇంత ఆదాయం వస్తున్నప్పటికీ కడప బస్టాండులో కనీస వసతులు కరవయ్యాయి.

కరెంటు పోతే చీకటే... : కడప డిపోలో 93 ఆర్టీసీ బస్సులు, 49 అద్దె బస్సులున్నాయి. ప్రతి రోజు 57 వేల కిలోమీటర్లు తిరుగుతాయి. సుమారు 60 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. టిక్కెట్లతో రోజుకు రూ.25 లక్షలు ఆదాయం వస్తుంది. అయినా ఇక్కడ మౌలిక సౌకర్యాలు కరవయ్యాయి. కనీసం బస్టాండులో జనరేటర్ లేదు. విద్యుత్తు పోతే గ్యారేజిలో ఉన్న జనరేటర్ ద్వారా ఆవరణకు మాత్రమే విద్యుత్తు ఇస్తారు. దుకాణాలకు, ఇతర వాటికి ఉండదు. ఇటీవల కార్గో కార్యాలయాన్ని తాత్కాలికంగా బస్టాండులోకి మార్చారు. రెండురోజుల విద్యుత్తు లేకపోవడంతో దాదాపు గంటపాటు కార్గో బుకింగ్ నిలిపేశారు. ఇక్కడ లగేజీ పెట్టుకుని బయటికి వెళ్లాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అనధికారికంగా ఒక లగేజీ గదిని ఏర్పాటు చేశారు. దానికి ఎలాంటి భద్రత లేదు. గదికి ఒక పట్టా అడ్డు పెట్టి ఉంచారు. నిబంధనల ప్రకారం బస్టాండు ఆవరణలో ఔషధ దుకాణం ఉండాలి. ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. బస్టాండుకు చంటి బిడ్డలతో తల్లులు వస్తుంటారు. పిల్లలకు పాలివ్వడానికి మహిళలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ప్రత్యేకంగా ఫీడింగ్ గది ఉండేది. తర్వాత తొలగించారు. చిన్న ఖాళీ స్థలం దొరికితే చాలు అద్దెకు ఇచ్చేస్తున్నారు. అధికారులు ఆదాయంపై దృష్టి పెడుతున్నారే తప్ప వసతుల కల్పన గురించి పట్టించుకోలేదు. దీనిపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వర్షమొస్తే అంతే...

చిన్నపాటి వర్షం కురిసినా బస్టాండు మొత్తం నీరు నిలిచిపోతుంది. పెద్ద వాన పడితే చెరువులా మారుతుంది. ఆ నీటిలో నుంచే ప్రయాణికులు రాకపోకలు సాగించాలి. ప్లాట్‌ఫాంల వద్ద అదే పరిస్థితి. దీనికి శాశ్వత పరిష్కారం ఎప్పుడు చూపుతారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

గుత్తేదారులు ముందుకు వస్తే...

కడప బస్టాండులో లగేజీ గది, ఔషధ దుకాణాలకు సంబంధించి గుత్తేదారులు ముందుకు వస్తే తప్పకుండా ఇస్తాం. బస్టాండులో విద్యుత్తు పోతే గ్యారేజీ నుంచి ఇస్తున్నాం. అక్కడున్న దుకాణాలకు కనెక్షన్ ఇవ్వలేదు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- **దిల్లేశ్వరావు, డీఎం, కడప**

తుప్పు.. ఎవరిదీ తప్పు?



రవాణాశాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో పత్రాలు లేనివి, వివిధ రకాల కేసుల్లో దొరికిన వాహనాలను కడప ఆర్టీసీ గ్యారేజీ సమీపంలో ఉంచారు. ఇవి ఎండకు, వానకు తడుస్తూ తుప్పు పట్టాయి. చాలారోజులుగా అలా వదిలేయడంతో వాటి మధ్యలో నుంచి మొక్కలు పెరిగాయి. ఇక్కడ సుమారు 60 ద్విచక్రవాహనాలతో పాటు ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయి. రవాణాశాఖ అధికారులు స్పందించి వేలం వేసి ప్రభుత్వానికి కనీం ఆదాయం వస్తుంది. లేదంటే మొత్తం తుప్పు పట్టి పనికిరాకుండా పోతాయి.

- **న్యూస్‌టుడే, చిన్నచౌకు(కడప)**

ఆటోను ఢీకొన్న కారు... ముగ్గురికి గాయాలు

ఒంటిమిట్ట : ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ఒంటిమిట్టకు చెందిన కుమారమ్మ, గంగమ్మ, కిరణ్‌కుమార్‌లు ఆటోలో ఉప్పరపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా మృకుందాశ్రమం వద్ద కారు ఢీకొంది. ఆటోలో ఉన్న ముగ్గురూ గాయపడగా 108లో ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఘనంగా గణపతి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

చక్రాయపేట, న్యూస్‌టుడే : గండిలోని కోదండరామాలయంలో గణపతి విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు రామస్వామి, నరసప్పస్వామి, రాజాస్వామి, రాఘవేంద్రశర్మ స్వాముల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, తీర్థప్రసాదాలతో పాటు భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం నూతన ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. వేడుకల్లో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామిగుప్త, కోదండ రామాలయ కమిటీ సభ్యులు సాదు విశ్వనాథరెడ్డి, వెంకటరామిరెడ్డి, గంగిరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

లింగాల, న్యూస్‌టుడే : పార్నపల్లెలో దాతల సాయంతో నిర్మించిన గణపతి, దత్తాత్రేయ, సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాణప్రతిష్ఠ అనంతరం భక్తులు సాయిబాబాను దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



అలంకరణలో సాయిబాబా

రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి



ఆటోలకు రహదారి భద్రతా నియమాల పోస్టర్లను అతికిస్తున్న ట్రాఫిక్ సీఐ జావెద్, పోలీసులు

కడప నేరవార్తలు : వాహనదారులు రహదారి భద్రతా నియమాలను పాటించకుంటే ప్రమాదాలకు గురవుతారని కడప ట్రాఫిక్ సీఐ జావెద్ అన్నారు. ట్రాఫిక్ ఠాణా వద్ద గురువారం నియమాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి ఆటోలకు అతికించారు. సీఐ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. అర్హత లేని వారికి, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఉన్నారు.

మద్యం కేసులో జైలుశిక్ష

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ఈ నెల 15న కడపకు చెందిన ఈశ్వరయ్య మద్యం తాగి ద్విచక్రవాహనం నడుపుతూ పోలీసు తనిఖీల్లో పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి అతడిని కోర్టులో హాజరుపరచగా ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి మంగళగౌరి కేసు పరిశీలించి, నేరం రుజువు కావడంతో ఏడు రోజులు జైలుశిక్షతో పాటు రూ.3 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ జావెద్ తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కడప నేరవార్తలు : కడప చిన్నచౌకు ఠాణా పోలీసులు వారి పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానితులకు గురువారం సీఐ తేజమూర్తి ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎక్కడైనా గొడవల జోలికి వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రౌడీయిజానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండు

సింహాద్రిపురం : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సాకే ఆదినారాయణ పేర్కొన్నారు. గురువారం స్థానిక బుడ్డయ్యస్వామి ఆలయంలో వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైకాపా పాలనలో వాల్మీకులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఎన్డీయే ప్రభుత్వం వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర పండగలా నిర్వహించటం హర్షణీయమన్నారు. సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

పులివెందుల (వేంపల్లె) : ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా పులివెందుల బాధ్యుడు బీటెక్ రవి సూచించారు. వేంపల్లె ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన కుళ్లాయమ్మ గురువారం పులివెందులకు వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ఆయనతో చర్చించారు. మండలాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని బీటెక్ రవి పేర్కొన్నారు.



బీటెక్ రవిని సత్కరిస్తున్న ఎంపీడీవో కుళ్లాయమ్మ

పారదర్శకంగా ఇసుక సరఫరా

పెండ్లిమర్రి, న్యూస్‌టుడే : ఇసుక సరఫరా పారదర్శకంగా చేపట్టాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ సూచించారు. గురువారం కొత్త గంగిరెడ్డిపల్లె ఇసుక రీచ్‌ను ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇసుక పంపిణీలో ఎలాంటి అక్రమాలకు చోటు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక సరఫరా చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకు అనుగుణంగా ఇసుక క్వారీలను గుర్తించి దశల వారీగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు అనురాధ, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తెదేపా మండల సమన్వయకర్త గంగిరెడ్డి, నాయకులు శ్రీనివాసులరెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



రీచ్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్, పక్కన ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

రాయితీ శనగలతో ప్రయోజనం శూన్యం

కమలాపురం, న్యూస్‌టుడే : మండలంలోని పలు చోట్ల పైపుల లీకేజీ కారణంగా నీరు కలుషితమవుతోందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వాటిని గుర్తించి మరమ్మతులు చేయాలని ఎంపీపీ గండి భారతి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున ప్రతి 15 రోజులకోసారి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. ముందుగా వ్యవసాయశాఖ ఏవో సరస్వతి మాట్లాడుతూ.. 25 శాతం రాయితీతో రైతులకు శనగలు ఇస్తున్నామన్నారు. ఈ విషయమై మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, ఉప ఎంపీపీ చెన్నకేశవరెడ్డి స్పందిస్తూ రైతులకు రాయితీతో ఇస్తున్న శనగలు బయట మార్కెట్‌లో ఉన్న ధర కంటే ఎక్కువగా ఉన్నాయని, దీంతో రైతులకు ప్రయోజనం లేదన్నారు. విద్యుత్తు శాఖ ఏఈ చాంద్ బాషా మాట్లాడుతూ కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు వచ్చాయని అవసరమున్న చోట ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీడీవో జ్యోతి మాట్లాడుతూ.. గత సమావేశంలో చర్చించిన అంశాలనే ఇంతవరకు చేయలేదని ఇప్పటికైనా చేయాలని అధికారులకు సూచించారు. పీఆర్ ఏఈ నిరంజన్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, ఎంఈవో సుభాషిణి, వెలుగు ఏపీఎం గంగాధర్, ఉపాధి ఏపీఎం పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సర్పంచులు, ఎంపీటీసీసభ్యులు, అధికారులు

సమాజ హితైషి వాల్మీకి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: రామాయణ మహాకావ్యాన్ని రచించి సమాజ హితం కోరేలా, విలువలు నేర్పిన మహా జ్ఞాని వాల్మీకి మహర్షి అని తెలుగు దేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరికృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు పేర్కొన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని కడప కోటిరెడ్డికూడలిలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి వారు వేర్వేరుగా పూలమాలలు వేసి అంజలి ఘటించారు. తెదేపా నేతలు పుట్టబోయిన శ్రీనివాసులు, అనిల్, రాజు, ఉదయ్, నాసిర్‌అలీ, కరీముల్లా పాల్గొన్నారు.



వాల్మీకి విగ్రహానికి అంజలి ఘటిస్తున్న తెదేపా ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, నాయకులు

వైవీయూ (కడప) : వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని వైవీయూ పరిపాలనాభవనంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపకులపతి కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, కంకణాల గంగయ్య, చంద్రఓబులరెడ్డి, వి.రామకృష్ణ, పాల్గొన్నారు. ☛ కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో వాల్మీకి జయంతి నిర్వహించారు.

సిద్దవటం : మండలంలోని భాకరాపేట శివారులోని ఏపీఎస్పీ పదకొండో బెటాలియన్‌లో వాల్మీకి చిత్రపటానికి బాధ్య కమాండెంటు నాగేశ్వరప్ప, సిబ్బంది అంజలి ఘటించారు.

పులివెందుల (వేంపల్లె) : పులివెందుల పట్టణంలోని కదిరి రోడ్డులో వాల్మీకి విగ్రహానికి సంఘం నాయకులు నివాళులర్పించారు. మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, వైస్ ఛైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, సంఘం నాయకులు అంబకపల్లె నారాయణస్వామి, బాలుడు, మేకల విశ్వనాథ్, దాసరి చంద్రమౌళి, రామాంజనేయులు, దాసరిశేఖర్ పాల్గొన్నారు.

వేంపల్లె : వాల్మీకి కారణజన్ముడని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో గురువారం వాల్మీకి జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు.

లింగాల : పార్నపల్లెలో వాల్మీకి సేవా సంఘం గౌరవాధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు.



పులివెందులలో వాల్మీకి విగ్రహం వద్ద నాయకులు



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి, తదితరులు

అకాల వర్షం... అన్నదాతలకు నష్టం

చక్రాయపేట, న్యూస్‌టుడే : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగులుస్తున్నాయి. మండలంలోని 803 హెక్టార్లలో సాగులో ఉన్న వరి అధికశాతం నేలమట్టమైందని రైతులు వాపోతున్నారు. ఒక్కో ఎకరాకు రూ.30 నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడులు పెట్టి సాగు చేశామని, అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని మామిళ్లపల్లె, బలిజపల్లె గ్రామాల్లోని పసుపు, చామంతి పంటలను గురువారం ఉద్యానశాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ఉద్యానశాఖాధికారిణి జ్యోతిర్మయి రైతులకు పలు సూచనలిచ్చారు. పంటల్లో నీరు నిల్వ లేకుండా బయటకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు ప్రశాంతి పాల్గొన్నారు. ● ఇటీవల కురిసిన వర్షాలకు ఇప్పపెంటలో నేలకొరిగిన వరి పంటను గురువారం జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్ని పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలు కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఈశ్వర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



ఇప్పపెంటలో నేలకొరిగిన వరిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

సిద్దవటంలో 57 ఎకరాల్లో వరిపంట నష్టం : సిద్దవటం : నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలతో సిద్దవటం మండలంలో 57 ఎకరాల్లో వరిపంట దెబ్బతింది. జంగాలపల్లె, వంతాటిపల్లె, టక్కోలు, జ్యోతి గ్రామాల్లో నేలకు ఒరిగింది. గురువారం బద్వేలు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు నాగరాజు, స్థానిక వ్యవసాయశాఖ సిబ్బంది జంగాలపల్లెలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలించారు.

తల్లిదండ్రులు మందలిస్తారని విద్యార్థి కిడ్నాప్ డ్రామా

పులివెందుల(వేంపల్లె), న్యూస్‌టుడే : పులివెందుల పట్టణానికి చెందిన అయిదో తరగతి విద్యార్థి కిడ్నాప్ డ్రామా చర్చనీయాంశమైంది. స్థానిక హనుమాన్‌వీధికి చెందిన ఓ విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పకుండా గురువారం ఇంటి నుంచి ఎక్కడికో వెళ్లి ఆలస్యంగా వచ్చాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే మందలిస్తారేమోనని భయపడ్డాడు. తనను నలుగురు ఆగంతకులు ముఖాలకు ముసుగులు వేసుకొచ్చి ఓ వాహనంలో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని తెలిపాడు. వారు మద్యం మత్తులో ఉండగా తప్పించుకుని వచ్చానని తల్లిదండ్రులకు కట్టు కథ చెప్పాడు. ఈ విషయం పట్టణంలో హల్‌చల్ సృష్టించింది. విద్యార్థి కిడ్నాప్ అయ్యాడంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ఈ విషయమై పట్టణ ఎస్సై నారాయణ, సీఐ గంగనాథ్‌బాబు రంగంలోకి దిగి విద్యార్థి చెప్పిన ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను పరిశీలించారు. విద్యార్థి చెప్పిన కిడ్నాప్ కథ అవాస్తమని తేల్చారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : మండలంలోని తాడిగొట్ల, పబ్బాపురం గ్రామాల్లో రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం అధికారులు, నాయకులు శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో ఖాజాయిబాబు, ఈవోపీఆర్డీ వెంకటసుబ్బారెడ్డి, కార్యదర్శులు నాగలక్ష్మి, శాంతమ్మ, నాయకులు శ్రీనివాసులురెడ్డి, ఓబుల్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, నాగిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, వేణుగోపాల్, చెన్నారెడ్డి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

వేముల : పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా గురువారం వేల్పులలో సీసీ రోడ్ల నిర్మాణానికి తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి భూమిపూజ చేశారు. పీఆర్‌ఏఈ అబ్దుల్లా, కార్యదర్శి అల్లూరయ్య, తెదేపా నాయకుడు వీరారెడ్డి పాల్గొన్నారు.

తొండూరు : మల్లేలలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీడీవో విష్ణుప్రసాద్, ఏపీఎం లావణ్యతో కలిసి తెదేపా నాయకుడు, మాజీ సర్పంచి నాగిరెడ్డి భూమిపూజ నిర్వహించారు. సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసులు, బండి శివమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పులివెందుల(వేంపల్లె), న్యూస్‌టుడే : పులివెందుల పట్టణంలోని సీయోనుపురం, అహోబిలాపురంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ తెదేపా నేత తూగుట్ల మధుసూదనరెడ్డిని స్థానికులు కోరారు. గురువారం ఆయన ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. వార్డుల్లో తాగునీటి సమస్యతో పాటు వీధి దీపాలు వెలగడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి కమిషనర్ రాముడుతో చర్చించారు. స్పందించిన ఆయన ట్యాంకర్లతో తాగు నీటిని సరఫరా చేస్తామని, త్వరలో మోటార్లకు మరమ్మతులు చేయిస్తామన్నారు.

ఇసుకాసురుల పాపం... ప్రజలకు శాపం



మండలంలోని ఎస్.రాజంపేట ప్రధాన రహదారి దారుణంగా మారింది. గత వైకాపా పాలనలో ఎస్.రాజంపేట, వంతాటిపల్లె, మూలపల్లె గ్రామాల్లోని పెన్నాలో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు నిర్వహించారు. టిప్పర్లు, లారీలు ట్రాక్టర్లు అధిక ఇసుకలోడుతో ఎస్.రాజంపేట మీదుగా ప్రయాణించడంతో ప్రధాన రహదారిపై గుంతలు పడి భారీగా దెబ్బతింది. మరమ్మతులు చేయకపోవడంతో వర్షపు నీరు నిలిచి రాకపోకలు వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, సిద్దవటం**

పసుపులేటికి ఆంధ్ర రత్నం పురస్కారం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: వైయస్ఆర్ జిల్లా ధార్మిక సంస్థల పరిరక్షణ సమితి, ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్ వీఏపీ విభాగంలో అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య, ఆంధ్ర ప్రదేశ్ కల్చరల్ అవేర్‌నెస్ సొసైటీ, అర్పిత సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రదానం చేయనున్న ఆంధ్ర రత్నం పురస్కారానికి ఎంపికయ్యారు. విజయవాడలో ఈ నెల 21న నిర్వహించే కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందజేయనున్నారు. శంకర్ రాయలసీమ జిల్లాల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, జాతీయ సమైక్యతపై ప్రేరణ కల్పించేలా ఉపన్యాసాలు ఇస్తున్నారు.

గుంతల రోడ్డు... ప్రయాణికుల ఇక్కట్లు

వల్లూరు, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీసీరోడ్లు, మురుగుకాలువలు, వీధి దీపాలు, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించడంలో జాప్యం చేయడంతో గ్రామస్థులకు అవస్థలు తప్పడం లేదు. కమలాపురం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. వల్లూరు నుంచి అంకాళమ్మ ఆలయం మీదుగా లింగాయపల్లె, గోటూరు, ఇసుకపల్లె గ్రామాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతింది. కంకర తేలిన రహదారిపై రాకపోకలు సాగించేందుకు మూడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో వారి అవస్థలు వర్ణనాతీతం. ఈ మూడు గ్రామాల ప్రజలు నిత్యం వల్లూరుకు వచ్చి వెళుతుంటారు. రెండు కిలోమీటర్ల మేర ఉన్న తారురోడ్డు పూర్తిగా గుంతలమయమై ఉండడంతో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కింద పడి గాయాలపాలవుతున్నారు. రహదారి దెబ్బతిని మూడేళ్లవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డుపై రాత్రి వేళల్లో రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రఘురామ్‌ను వివరణ కోరగా రోడ్డు మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రయాణం భయం భయం

నాది లింగాయపల్లె. నేను ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. ఈ రోడ్డు పూర్తిగా పాడైంది. గుంతలతో ప్రమాదకరంగా మారింది. విద్యార్థులు వల్లూరులోని ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడుగుమేర గుంతలు ఉన్నాయి. రాత్రి సమయాల్లో ఈ రోడ్డుపై వెళ్లాలంటే భయంగా ఉంది. సమస్యను గుర్తించి అధికారులు రోడ్డును బాగు చేయాలని చేయాలి.

- **సుబ్బరాయుడు, ఆటోడ్రైవర్**



అధ్వానంగా లింగాయపల్లెకు వెళ్లే రహదారి